నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- నేటి నుంచి ప్రారంభం
- అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి



దేవరాపల్లి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ వర్మ

దేవరాపల్లి: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ యు.వి.ఎస్. వర్మ మంగళవారం సందర్శించారు. ఇక్కడ సీసీ కెమెరాలు, బెంచీలు ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 278 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 303 మంది, ప్రైవేటు విద్యార్థులు 16 మంది హాజరవుతారన్నారు. వీరికి 15 గదులు కేటాయించామని, అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, అరగంట ముందుగానే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

రావికమతం: కొత్తకోట జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ సాయికుమార్ మంగళవారం తెలిపారు. మొత్తం 323 మంది పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్, తదితర గ్యాడ్జెట్లు వెంట తేవొద్దన్నారు. అధికార్లు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తారన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు.

రోలుగుంట: ఇంటర్మీడియట్ పరీక్షలు సర్వం సిద్ధం చేశామని ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. స్థానిక కళాశాలలో ఇన్విజిలేటర్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. పరీక్షల నిర్వహణ, సమయపాలన, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇన్విజిలేటర్ల సమస్యలను నివృత్తి చేశారు.

క్లుప్తంగా

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామానికి చెందిన దివంగత సుందరపు సత్యనారాయణ కుమారులు విద్యాభివృద్ధికి ఏటా అందిస్తున్న సహకారం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు సత్యనారాయణ జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్, మహేష్, శివ మంగళవారం స్థానిక హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన 120 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, కొమార ఈశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, కొమార ఎర్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.21 లక్షల రుణాలు



రైతులకు రుణాలందిస్తున్న సన్యాసిరావు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వడ్డాది కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు తెలిపారు. మంగళవారం వడ్డాది, చిన అప్పనపాలెం తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులకు రూ. 21 లక్షలు రుణాలను ఆయన పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పలు రాయితీ రుణాలను అందిస్తున్నారన్నారు. డైరెక్టర్లు కోవెల ఈశ్వరరావు, పాలిమేర కాశి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి ఇన్వెర్టర్ బ్యాటరీ బహూకరణ



ఇన్వెర్టర్ బ్యాటరీ అందజేస్తున్న సర్పంచ్ సంజీవిరావు తదితర్లు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామదేవత మోదకొండమ్మ ఆలయానికి ఇన్వెర్టర్ బ్యాటరీని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు మంగళవారం ప్రధాన అర్చకులుకు అందజేశారు. దీనికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు దంపతులతోపాటు చిన్న అప్పన్నపాలేనికి చెందిన దొండా నాగేశ్వరరావు దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, నాయకులు పోతిన జగదీశ్, పడాల అప్పలనర్సయ్య, చింతా వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి



స్టడీ మెటీరియల్ అందిస్తున్న నాయకుడు అప్పలరాజు, హెచ్‌ఎం శివరాంప్రసాద్

నాతవరం: సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే సాధ్యపడుతుందని ఉప సర్పంచ్ కరక అప్పలరాజు తెలిపారు. దివంగత నేత అంకం రెడ్డి జమీలు జ్ఞాపకార్థంగా స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీలు ఆశయాలు దృష్టిలో పెట్టుకుని పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం కాశపు శివరాంప్రసాద్, హాస్టల్ వార్డెను రొంగలి శివ వరలక్ష్మి, హైస్కూల్ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ నాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, వర్తక సంఘం కన్వీనర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి



అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీవో, వైద్య సిబ్బంది

నాతవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారించటమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. డి.యర్రవరం బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రికార్డులను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు, గ్రామస్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన చర్యలు ఉంటాయన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరుపై కలెక్టరుకు నివేదిస్తామన్నారు. సచివాలయ కార్యదర్శి షేక్ రంజాన్‌బేజీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. కొండల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికంగా బాలురు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఐరన్ పోలిక్ మాత్రలను వేయించాలని సూచించారు. ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతర గోడ పత్రిక విడుదల



గోడ పత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: నూకాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. చీడికాడలో ఈ నెల 21న నిర్వహించనున్న నూకాలమ్మ జాతరకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం రాత్రి తారువ క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ను ఆహ్వానించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పరువాడ మహేష్, సిమెంట్ నాయుడు, పరువాడ రామారావు, డోకల దాసు, పీలా జగ్గుబాబు పాల్గొన్నారు.

వెదుళ్లవలసలో రీసర్వే సమస్యలు పరిష్కారం

రొలుగుంట: కొవ్వూరు పంచాయతీ వెదుళ్లవలస రెవెన్యూలో తొలిదశ భూసర్వేలో 118 ఖాతాల్లో తలెత్తిన సల్ప లోపాల సవరణకు కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలతో అవకాశం ఏర్పడింది. దీంతో తహసీల్దార్ దండోరా వేయించి కొవ్వూరు సచివాలయంలో లోపాల సవరణకు చర్యలు చేపట్టారు. భూ రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ నరేంద్రబాబు, వీఆర్వో నాగమణి, సర్వేయర్ లక్ష్మణరావు రైతుల పట్టాదారు పాసుపుస్తకం, భూ విస్తీర్ణం, సరిహద్దుల్లో రైతుల చిరునామాలు తీసుకుని సమస్యలు తలెత్తకుండా సరిచేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు 118 ఖాతాలకుగాను 80 ఖాతాలు పరిష్కరించామన్నారు. మరో రెండు రోజుల్లోగా మిగిలిన వారు పరిష్కరించుకోకపోతే నర్సీపట్నం ఆర్డీవో అనుమతి తీసుకోవాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

గొలుగొండ: స్థానిక గురుకుల కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరకాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ మంగళవారం తెలిపారు. 5వ తరగతిలో 80సీట్లు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 80 సీట్లు భర్తీ చేస్తామన్నారు. రాత పరీక్ష ఆధారంలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం



దేవరాపల్లిలో అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలను మింగిస్తున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి



రావికమతం: విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



రోలుగుంటలో కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వైద్యాధికారి విమలగిరి

దేవరాపల్లి: పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. దేవరాపల్లి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఉపాధి హామీ ఏపీవో చంద్రకళ, ఆశా కార్యకర్త కమల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు డీవార్మింగ్ డే నిర్వహిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. మంగళవారం చౌడువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను నమిలి మింగించారు. సింగన్నదొరపాలెం పాఠశాల విద్యార్థులకు హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు మాత్రలను మింగించారు. ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్‌ఎడ్యుకేటర్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది రేవతి, చిన్నమ్మలు, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

రావికమతం: పిల్లల ఆరోగ్యాన్ని హరించే నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను టి.అర్జాపురం హైస్కూల్‌లో కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నమిలి మింగించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం కె.ఆర్.ఎస్ నాయుడు, సీఆర్పీ జి.రామారావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం హైస్కూలులో వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలోని 5,400 మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎం.కోడూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్ మాత్రలు పంపిణీ చేశారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో 36 పాఠశాలలు, 45 అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని వైద్యాధికారి కె.ఎం.నాయుడు తెలిపారు. 4,500 మందికి మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఇన్‌చార్జి వైద్యాధికారి బి. రవితేజ, ఎంపీహెచ్‌ఈవో పి.రవికుమార్, నాయకుడు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ మండలంలో 6 వేలకుపైగా విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు.

వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సురేష్‌కుమార్ మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత్రల పంపిణీ తర్వాత విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కలిప్తామన్నారు. హెచ్‌ఎం ఎల్.వై.పాత్రుడు, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు, పీహెచ్‌ఎన్ జి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీ పరిధి 20 పాఠశాలల్లో 2,770 మంది విద్యార్థులకుగాను 2,536 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విమలగిరి పలు సూచనలు చేశారు. తొలి రోజు 91 శాతం పంపిణీ చేశామన్నారు.

మాకవరపాలెం: బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల పరిధిలో 11,600 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్టు వైద్యాధికారులు శ్రీవిద్య, చరిష్మ తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు కళాశాలలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవోలు గంగరాజు, జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



కె.కోటపాడు: చౌడువాడలో మాత్రలను వేస్తున్న వైద్యాధికారి నిర్మల



మాడుగుల రూరల్: కె.జె.పురం హైస్కూలులో మాత్రలు వేస్తున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు



నాతవరం: విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి సురేష్‌కుమార్, హెచ్‌ఎం పాత్రుడు

హోరాహోరీగా ఎడ్ల, గుర్రపు పరుగు పోటీలు

- ఘనంగా మాడుగుల మోదకొండమ్మ తీర్థం



మాడుగుల రూరల్: వీరనారాయణంలో దౌడు తీస్తున్న ఎడ్లు



మాడుగులలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఈర్లె అనురాధ, కమిటీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల: మోదకొండమ్మ తీర్థం సందర్భంగా మంగళవారం మాడుగులలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో 15 ఎడ్లబళ్లు పాల్గొనగా, విజేతగా మాడుగుల బోయపాడు నిలిచింది. చీడికాడ మండలం అర్జునగిరికి చెందిన ఎడ్లబండికి ద్వితీయ స్థానం దక్కింది. జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందెంలో పది గుర్రాలు పాల్గొన్నాయి. ఇందులో రాయపురాజ పురానికి చెందిన గుర్రం విజేతగా నిలిచింది. మునగపాక గ్రామానికి చెందిన గుర్రం ద్వితీయ స్థానం దక్కించుకుంది. తొలుత ఈ పోటీలను కె. కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలు తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ (పెదబాబు), సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీషా తదితర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు తదితర సారథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. రాత్రి పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారికి రూ. 50 వేల విరాళం

భక్తులు పుట్టా ప్రసన్నరాజ్, జయరత్నావల్లీ దంపతులు రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు అందజేశారు. దాతలను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

వీరనారాయణంలో..

మాడుగుల రూరల్: వీరనారాయణంలో భక్తాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పరుగు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, నాయకులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణ కోరుతూ ర్యాలీ రేపు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వ్యాపారులు

నర్సీపట్నం: పట్టణాభివృద్ధి దృష్ట్యా మెయిన్ రోడ్డును 120 అడుగుల మేర విస్తరించాలని కోరుతూ ఈ నెల 16న శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు నర్సీపట్నం అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి ఎఫ్‌ఎంబీ ప్రకారం రోడ్డును వంద అడుగుల నుంచి 120 అడుగులు విస్తరించాలని డిమాండ్ చేశారు. మెయిన్‌రోడ్డు ఇరుక్కుగా ఉండటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటం వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వీటన్నింటి నేపథ్యంలో రోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. శాంతియుతంగా నిర్వహిస్తున్న ర్యాలీకి ప్రజలంతా సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు.

రోడ్డు విస్తరణకు వ్యతిరేకంగా వ్యాపారులు బంద్

నర్సీపట్నం రోడ్డు విస్తరణను కుదించాలని డిమాండ్ చేస్తూ రోడ్డు వైడింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యాపారులంతా దుకాణాలు మూసివేసి ర్యాలీ నిర్వహించారు. వందడుగులు కాకుండా 60 అడుగుల మేర విస్తరించాలని నినాదాలు చేశారు. పెదబొడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వ్యాపార ఇబ్బందులు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. టీడీఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం నగదు రూపేణా చెల్లించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.కనకారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. మధ్యాహ్నం నుంచి యథావిధిగా దుకాణాలు తెరిచి వ్యాపార కార్యకలాపాలు సాగించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



తోటకూరపాలెంలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రావికమతం: పశుసంవర్ధక శాఖ ఏడీ టి.పుష్ప ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా తోటకూరపాలెం, పి.పొన్నవోలు, జి.చీడిపల్లి గ్రామాల్లో ఈ శిబిరాన్ని ఎంపీపీ పైల రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తట్టబంద, కొత్తకోట పశువైద్యులు నూకేశ్వరరావు, శైలజ మాట్లాడుతూ సాధారణంగా అక్టోబరులో పశువులకు వ్యాధి సంక్రమిస్తుందన్నారు. గిట్టల మధ్య బొప్పలు, నోటి నుంచి నురుగ వచ్చి మేత మానేసి నీరసించి చనిపోయే అవకాశం ఉందన్నారు. గర్భస్రావం, పెయ్యల మరణాలు, ఉత్పత్తిలో తగ్గుదలకు ఈ వ్యాధి కారణమవుతోందన్నారు. వీటి నివారణకు టీకా కార్యక్రమం చేపట్టామన్నారు. బుధవారం జెడ్.బెన్నవరం, గుడిప గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



ఉపాధ్యాయులతో మోక్షిత్

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థి మెరిట్ టాలెంట్ టెస్టులో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించాడు. ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 31న రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ మెరిట్ టెస్టు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి బోళెం మోక్షిత్ ఈ టెస్టులో ప్రతిభ చూపాడని హెచ్‌ఎం అచ్యుతరామయ్య మంగళవారం అభినందించారు. విజయవాడలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నుంచి సదరు విద్యార్థి రూ.6 వేలతోపాటు సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నాడు.

ఆశ కార్యకర్తలకు లక్ష్య నిర్దేశం



మాట్లాడుతున్న వైద్యాధికారి నాయుడు

మాడుగుల రూరల్: కింతలి పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.ఎం.నాయుడు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వాటి నివారణ గురించి, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు లక్ష్యాలను పూర్తిస్థాయిలో అధిగమించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను విడుదల చేశారు. ఇన్‌చార్జి వైద్యాధికారి బి. రవితేజ, ఆరోగ్య పర్యవేక్షకులు హేమలత, జి. ప్రసాదు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాలకు వేలం రేపు

మాడుగుల రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 16న ఉదయం 8 గంటలకు వేలం వేస్తామని ఇన్‌స్పెక్టర్ ఎస్. సింహాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు ఆధార్ కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

పది ప్రతిభ విద్యార్థినులకు ప్రోత్సాహకం



విద్యార్థినులకు పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

దేవరాపల్లి: పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపే పది, ఇంటర్ విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తామని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ తెలిపారు. స్థానిక కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు దాతలు సమకూర్చిన పరీక్ష మెటీరియల్‌ను ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీనుతో కలిసి ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ విద్యార్థినులకు రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ శశి, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.